సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025

కేటీఆర్ వర్సెస్ కలెక్టర్!

- గతంలో కలెక్టర్‌ను సన్నాసి అన్న కేటీ రామారావు
- అప్పటి నుంచి తమను కలెక్టర్ టార్గెట్ చేశారంటున్న అనుచరులు
- కేటీఆర్ ఫ్లెక్సీతో ఉన్న టీస్టాల్ తరలింపు, యజమానిపై కేసు
- కలెక్టర్‌పై పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ కార్యకర్త అనిల్‌పై కేసు
- అనిల్ దొరక్కపోవడంతో ఆయన బాబాయ్‌పై చర్యలు
- అగ్రహారం పాలకేంద్రం సీజ్‌తో రోడ్డెక్కిన రైతులు
- సీఎస్ శాంతకుమారి వరకు వెళ్లిన వ్యవహారం
- నిజాయతీగా పనిచేస్తే నిందలేస్తున్నారంటున్న కలెక్టర్


సందీప్‌కుమార్ ఝా


కేటీఆర్


అగ్రహారం వద్ద రైతుల ధర్నా (ఫైల్)

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

విధినిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరించే రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కొన్నిరోజులుగా వార్తల్లో వ్యక్తిగా నిలుస్తున్నారు. భూకబ్జాలు, అనుమతిలేని వాణిజ్య సముదాయాలు, వ్యాపారాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో వింతేమీలేదు. అయితే.. బాధితులంతా తాము కేటీఆర్ అనుచరులం, బీఆర్ఎస్ నాయకులం కాబట్టే తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల కేటీఆర్ సిరిసిల్లకు వచ్చిన సందర్భంగా కలెక్టర్‌ను సన్నాసి.. ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నాడని వ్యాఖ్యానించారు. అప్పటి నుంచి తమపై కలెక్టర్ దాడులు చేయిస్తున్నాడని కేటీఆర్ అనుచరులు ఆరోపిస్తుండగా..తనపని తానుచేసుకుంటున్నానే తప్ప.. ఎలాంటి ప్రతీకారాలకు వెళ్లాల్సిన అవసరం లేదని కలెక్టర్ సమాధానమిస్తున్నారు. అయితే ఈ వ్యవహారమంతా ఇప్పుడు రాజకీయరంగు పులుముకుంటోంది. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాపై చర్యలు తీసుకోవాలంటూ తాజాగా బీఆర్ఎస్ నాయకులు సీఎస్ శాంతికుమారిని కలవడంతో వివాదం అందరి దృష్టిని ఆకర్షించింది.

కేటీఆర్ అనుచరులు ఏమంటున్నారు?

- టీస్టాల్ వద్ద కేటీఆర్ బొమ్మ ఉన్న కారణంగా ఈనెల 19న దాన్ని తరలించారు. టీస్టాల్ యజమానికి బత్తుల శ్రీనివాస్‌పై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు పెట్టారు. కేవలం తమ నాయకుడి బొమ్మ పెట్టుకున్నాడన్న అక్కసుతో బీదవాడిపై ప్రతాపం చూపించారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.
- కరీంనగర్ డెయిరీకి అనుబంధంగా ఉన్న రాజన్నసిరిసిల్ల జిల్లా అగ్రహారంలోని పాల శీతలీకరణ కేంద్రాన్ని ఇటీవల కలెక్టర్ సీజ్ చేయించారు. విషయం తెలుసుకున్న పాడిరైతులు ఆందోళనకు దిగారు. డెయిరీ నిర్వాహకులు బీఆర్ఎస్, కేటీఆర్‌కు మద్దతుదారులన్న కారణంతోనే సీజ్‌చేశారని ఆరోపించారు.
- కలెక్టర్ తీరుపై తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి (గతంలో కేఏపాల్ మీద దాడిచేసిన వ్యక్తి) సందీప్‌కుమార్ ఝా మీద కేసులున్నాయని సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టాడు. అతను పోలీసులకు చిక్కకపోవడంతో అతని చిన్నాన్న అబ్బాడి రాజిరెడ్డి 30 గుంటల స్థలం కబ్జాచేశాడని పోలీసులు అరెస్టు చేశారు. రాజిరెడ్డి మూగవాడన్న కనికరం లేకుండా పట్టుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.
- 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకాల్లో నిబంధనలకు తూట్లు పొడిచారు. కౌన్సెలింగ్ లేకుండానే కలెక్టర్ అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇచ్చాడు. నిబంధలనకు విరుద్ధమని చెప్పిన డీఈవోను కలెక్టర్ బెదిరించారు. ఉంటే ఉండు లేకుంటే లీవులో వెళ్లంటూ హెచ్చరించారు.

ఆరోపణలపై కలెక్టర్ ఏమన్నారంటే..

- సిరిసిల్లలో పబ్లిక్ ప్రాంతాన్ని టీస్టాల్ యజమాని ఆక్రమించి నడుపుతున్నాడు. పైగాఅతనికి ఎలాంటి ట్రేడ్ లైసెన్స్ లేదు. అతను ఎన్నికల నియమావళి ఉల్లంఘించాడని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు.
- కరీంనగర్ డెయిరీకి అనుబంధంగా ఉన్న అగ్రహారం డెయిరీ లైసెన్స్ లేకుండా నడుస్తోంది. దానికి ఫైర్ సేఫ్టీ లైసెన్స్, ల్యాండ్ కన్వర్షన్, బిల్డి ంగ్ పర్మిషన్, పర్యావరణ అనుమతులు లేవు.
- తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో సర్వే నెంబరు 1,183లోని స్థలాన్ని రాజిరెడ్డికి ప్రభుత్వం అసైన్ చేయలేదు. 2018లో ప్రభుత్వ రికార్డులను టాంపరింగ్ చేసి తనపేరిట మార్చుకున్నాడు. ఇది అవినీతి వ్యవహారం
- వాస్తవానికి జగన్మోహన్‌రెడ్డి విధులపై అంకితభావం లేదు. నాకు తెలియకుండా డీఈవో ఆర్డర్స్ ఇచ్చారు. అదేంటని అడిగితే.. పైనుంచి ఆర్డర్స్ ఉన్నాయని సమాధానమిచ్చాడు. జిల్లా సర్వశిక్షాభియాన్ ఛైర్మన్‌గా నేను ఉండగా.. వ్యక్తిగత అజెండాలతో పనిచేయడం, పైగా ఆ ఆదేశాలు నేను ఇచ్చానని ప్రచారం చేయడం ఎంతమేరకు సమంజసం?



ఎములాడ దారిలో..


పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్


పట్టువస్త్రాలు పట్టుకొస్తున్న టీటీడీ అర్చకులు


వేములవాడకు వస్తున్న భక్తులు


తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు


పిల్లలకు స్నానం చేయిస్తున్న తల్లి

- వైభవంగా రాజన్న జాతర షురూ
- తరలివస్తున్న భక్తులు
- నేడు మహాశివరాత్రి వేడుకలు
- రూ.2.39 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు
- గుడి చెరువులో శివార్చన
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం, విప్ ఆది, టీటీడీ అర్చకులు

వేములవాడ: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ హరహర మహాదేవ నామస్మరణతో మారుమోగుతోంది. శివమాలధారులు, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో ఆధ్యాత్మిక క్షేత్రం కిక్కిరిసిపోతోంది. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాజాతరకు వరంగల్, సికింద్రాబాద్, ఖమ్మం, కరీంనగర్, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ పాత జిల్లాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే గుడారాలు వేసుకుంటున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు రాజన్నను దర్శించుకుని కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. గుడి ఆవరణలో జాగరణ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు చేసిన ఆలయ అధికారులు లఘు దర్శనలకు మాత్రమే అనుమతించారు. రూ.2.39 కోట్లతో జాతర ఏర్పాట్లు చేశారు. గుడి చెరువు ఖాళీ స్థలంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివార్చనలో భాగంగా 1,500 మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో మాదిరి కాకుండా ఈ సారి పేయిడ్ పాస్‌లను అధికారులు జారీ చేశారు. పట్టణమంతా పోలీసుమయం కావడంతో భక్తులు, స్థానికులు పట్టణంలోకి వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. జాతరకు ఈసారి 4 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

రాజన్నకు పట్టువస్త్రాల సమర్పణ

స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించారు., టీటీడీ దేవస్థానం అర్చకులు సైతం పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పక్షాన ఆలయ డిప్యూటీ ఈవో లోక్‌నాథ్ ఆధ్వర్యంలో అర్చకులు, ట్రస్టు సభ్యులు మంగళవారం రాత్రి రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు స్వస్థితో స్వాగతం పలుకగా, ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి స్వాగతం పలికారు. శృంగేరి శారదాపీఠం పక్షాన రాధాకృష్ణశర్మ స్వామివారికి పట్టు వస్త్రాలతో పాటు రుద్రాక్షమాలను సమర్పించారు.



జాతర ఏర్పాట్లు పరిశీలన

జాతరలో ఏర్పాట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహజన్‌లు మంగళవారం పరిశీలించారు. భక్తులకు మెరుగైన సేవలందించాలని అధికారులను ఆదేశించారు. విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని అన్నారు. వారి వెంట ఆర్డీవో రాజేశ్వర్, ఈవో వినోద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నిరంతరం అన్నదానం

జాతర మహోత్సవాల్లో పాల్గొనే భక్తులు, పోలీసు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి వాసవీ సేవా సమితి, మన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. బుధ, గురు, శుక్రవారాలు మధ్యాహ్నం వరకు నిరంతరం కొనసాగుతుందని నిర్వాహకులు మోటూరి మధు, కొమ్ము నటరాజ్‌లు తెలిపారు బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆలయంలో నేడు జరిగే ఉత్సవాలు

- వేకువజామున 3.30 నుంచి 4 గంటల వరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు
- ఉదయం 4 నుంచి 4.25 వరకు సుప్రభాత సేవ
- సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు శివస్వాములకు ప్రత్యేక దర్శనం
- సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారి కల్యాణ మంటపంలో మహాలింగార్చన
- రాత్రి 11.35 నుంచి వేకువజాము 3.30 గంటల వరకు లింగోద్భవ కాలమందు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

ప్రత్యేక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు

జాతరకు వచ్చే భక్తులకు ప్రత్యేకంగా ఏడు అత్యవసర ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి రజిత మంగళవారం పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తినా వెంటనే ఆరోగ్య శాఖ సిబ్బంది స్పందించి వైద్య సేవలందించేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయని, అత్యవసర వేళల్లో 108ను ఉపయోగించుకుని భక్తులకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

ఉచిత బస్సు సదుపాయం


వేములవాడ అర్బన్: భక్తుల కోసం ఉచిత బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ సేవలను మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజన్న గుడి చెరువు వరకు ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు నడుస్తుందన్నారు. కార్యక్రమంలో రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వేములవాడరూరల్: జాతరలో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేములవాడ ఫైర్‌స్టేషన్ కార్యాలయంలో వివిధ జిల్లాల నుంచి విధులకు వచ్చిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉత్సవాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు.


కళాకారుల ప్రదర్శన


కళాకారులతో మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్



పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సిరిసిల్లకల్చరల్/కోనరావుపేట/చందుర్తి: శాసన మండలి ఎన్నికల పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. చందుర్తి, కోనరావుపేట, వేములవాడల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. పోలింగ్ సక్రమంగా జరిగేందుకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతీ ఓటర్‌కు ఓటరు స్లిప్ అందేలా జాగ్రత్త వహించాలని సూచించారు. ఓటర్లకు క్యూలైన్లు, ఏర్పాటు చేయాలని, వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు ప్రాధాన్య క్రమంలో ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చివరి ఓటు వినియోగించుకున్నాక బ్యాలెట్ బాక్సులను నిబంధనల మేరకు సీల్ చేయాలని తెలిపారు. విధుల నిర్వహణలో అలసత్వం లేకుండా ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో రాజేశ్వర్‌రావు, తహసీల్దార్లు విజయ్ ప్రకాశ్‌రావు, మహేశ్, సుజాత, ఇతర అధికారులు ఉన్నారు.

సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన

పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ సందర్శించారు. కేంద్రాల వారీగా సామగ్రిని పంపిణీ చేసేందుకు కౌంటర్లు ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవోలు రాధాబాయి, రాజేశ్వర్, తహసీల్దార్లు ఉమారాణి, మహేశ్, కమిషనర్ సమ్మయ్య ఉన్నారు.

రైతు కుటుంబానికి రూ.లక్ష తక్షణ సాయం

ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు దేవయ్య కుటుంబానికి తక్షన సాయంగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష మంగళవారం అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ ఆవిష్కరణ

ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆవిష్కరించారు. 28వరకు జరుగనున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల నేపథ్యంలో కుటుంబ, దేశ ఆర్థికాభివృద్ధికి మహిళా సాధికారత కీలకమైందన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ టీఎన్ మల్లికార్జున్‌రావు, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి పీబీ శ్రీనివాస్, పౌర సంబంధాల అధికారి వంగరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ అఖిల్ మహాజన్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం/తంగళ్లపల్లి: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్‌శాఖ పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, చందుర్తి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం తనిఖీ చేసి కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రత చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 41 పోలింగ్ కేంద్రాల్లో 23,347 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేందుకు 200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోస్తు ఏర్పాట్లు చేశామన్నారు. పర్యవేక్షణలో టౌన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, రూరల్ సీఐ మొగిలి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన ప్రచారం

- ఎమ్మెల్సీ కోసం కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పోటాపోటీ సభలు
- సభలతో పార్టీ క్యాడర్లలో జోష్
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే


నరేందర్‌రెడ్డి


అంజిరెడ్డి


ప్రసన్న హరికృష్ణ


సర్దార్ రవీందర్‌సింగ్


వంగ మహేందర్‌రెడ్డి


మల్క కొమురయ్య


కూర రఘోత్తమరెడ్డి


అశోక్‌కుమార్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం పర్వం ముగిసింది. నిబంధనల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి సైలెంట్ మోడ్ అమలులోకి వచ్చింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన పార్టీలు, సంఘాలు ధీమాగా ఉన్నాయి. కాంగ్రెస్ పక్షాన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, బీజేపీ తరఫున కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఎస్పీ తరఫున బీసీ నేతలు నిర్వహించిన సభల సక్సెస్‌తో ఆయా క్యాడర్ జోష్‌లో ఉంది.

ఉమ్మడి కరీంనగర్ కీలకం

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కీలకంగా మారింది. ఉమ్మడి జిల్లా ఓటర్లు ఎటు మొగ్గితే వాళ్ల విజయం సాధించే అవకాశాలున్నాయి. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3 లక్షల 55 వేల 159 ఓట్లు ఉండగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 1 లక్షా 60 వేల 260 ఓట్లున్నాయి. అంటే ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి దాదాపు సగం ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓటర్ల తీర్పుపైనే అభ్యర్థుల భవిత ఆధారపడి ఉంది. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి మొత్తం 27,088 ఓట్లు ఉండగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 8,135 ఓట్లున్నాయి. ఇక్కడ కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లా గెలుపోటములను నిర్ణయించనుంది.

గెలుపుపై ధీమా

పట్టభద్రులకు సంబంధించి మొత్తం 56 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థుల నడుమ త్రిముఖ పోటీ నెలకొంది. అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి పార్టీల బలంపై, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ బీసీ వాదంపై ఆశలు పెట్టుకున్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, ట్రస్మా మాజీ అధ్యక్షుడు శేఖర్‌రావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 15 మంది పోటీలో ఉండగా, బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్, యూటీఎఫ్, యూఎస్‌పీసీ మద్దతుతో వై.అశోక్‌కుమార్, ఎస్‌టీయూ, సీపీఎస్‌ల నుంచి పోటీలో ఉన్న కూర రఘోత్తంరెడ్డి నడుమ పోటీ నెలకొంది.

ప్రచారసభలతో జోష్

గతంలో లేని విధంగా ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం హోరెత్తింది. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార సభలు నిర్వహించి తమకు ఓటెందుకు వేయాలో వివరించే ప్రయత్నం చేశారు. సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రచార బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్య గెలుపు బాధ్యతలను పూర్తిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భుజానికెత్తుకొన్నారు. కామారెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్ పాల్గొన్నారు. బీసీ వాదంతో బరిలోకి దిగిన బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా బీసీ జేఏసీ రాష్ట్ర నేతలు, బీసీ సంఘాల నేతలు, ఓయూ జేఏసీ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రచారం నిర్వహించారు. సభల విజయవంతంతో క్యాడర్‌లో జోష్ నెలకొనడంతో పాటు, గెలుపుపై ధీమా పెరిగింది.

క్లుప్తంగా

ప్రేమిస్తున్నానని బాలికను వేధించిన వ్యక్తికి జైలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ప్రేమిస్తున్నాని ఓ బాలికను వేధిస్తున్న మియ్యాపూర్ గ్రామానికి చెందిన గోష్కిక కుమార్(23)కు ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి, సెషన్స్ జడ్జి శ్రీనివాస్‌రావు మంగళవారం 30 రోజుల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2019 నవంబర్ 20న ఓ బాలికలను ప్రేమిస్తున్నా, తననూ ప్రేమించాలని, ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని వేధించాడు. తనను ప్రేమించకుంటే చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితురాలి తండ్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు కోర్టులో సాక్ష్యాధారాలు సమర్పించారు. వాదనలు విన్నంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

మంథనిలో బోర్డు తిప్పేసిన నగల వ్యాపారి?

మంథని: పట్టణంలోని ఓ నగల దుకాణదారు బోర్డు తిప్పేసి పరారైనట్లు చర్చ జోరుగా సాగుతోంది. దుకాణానికి తాళం వేసి కుటుంబం మొత్తం నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిందని సమాచారం. వారి మొబైల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకున్నట్లు తెలిసింది. దుకాణం తెరవకపపోవడం, ఫోన్లు పని చేయకపోవడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. తమకు కుచ్చుటోపీ పెట్టి ఉడాయించారా? లేదా ఏదేవి అవసరం నిమిత్తం వెళ్లారా? అనేది తెలియాల్సి ఉంది. వివాహాలకు సంబంధించి ఆభరణాల కోసం చాలా మంది దుకాణాదారుకు బంగారం ఇచ్చినట్లు తెలిసింది. అదేవిధంగా స్థానికుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బు అప్పుగా తీసుకున్నట్లు సమాచారం. దుకాణాదారు పరారు కావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


చంద్రయ్య (ఫైల్)

కోరుట్లరూరల్: మాదాపూర్‌కు చెందిన ముక్కెరాల చంద్రయ్య (70) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. చంద్రయ్య సైకిల్‌పై వెంకటాపూర్ వెళ్లి తిరిగి మాదాపూర్ వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అంజూ ట్రాక్టర్ నడుపుతూ వెంకటాపూర్ వైపు వెళ్తున్నాడు. కాకతీయ కాలువ డీ–40 మూలమలుపు వద్ద చంద్రయ్య ట్రాక్టర్‌ను ఢీకొట్టి రోడ్డు కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రయ్య కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బంధువులు డ్రైవర్ అంజి ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. స్థానిక నాయకులు సముదాయించి ధర్నాను విరమింప చేశారు.

తండ్రి హత్య కేసులో యావజ్జీవం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): పూసాల గ్రామానికి చెందిన తీగల రాజేశం(40) తన తండ్రి తీగల నర్సయ్యను హత్య చేశాడనే నేరం రుజువు కావడంతో యావజ్జీవ శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి శ్రీనివాస్‌రావు మంగళవారం తీర్పు ఇచ్చారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన నర్సయ్య కుటుంబం పూసాలలో నివాసం ఉంటోంది. రాజేశం 20ఏళ్ల క్రితం హత్యాయత్నం కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. అప్పట్నుంచి తల్లిదండ్రులతోనే కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో 2023 డిసెంబర్ 8న ఉదయం కొనుగోలు సెంటర్లో ధాన్యం అరబెట్టేందుకు పెద్దకొడుకు రాజేశం, చిన్నకోడలును రావాలని తండ్రి నర్సయ్య పిలిచారు. రాజేశం సైకిల్‌పై అక్కడకు వెళ్లగా.. తాను పనిచేయనని సైకిల్‌పై వెళ్లిపోతున్నాడు. ఈ క్రమంలో తండ్రి సైకిల్ తాళం చెవి తీసకున్నాడు. ఆగ్రహించిన రాజేశం బలంగా నెట్టి వేయడంతో తండ్రికింద పడిపోయాడు. ఆ వెంటనే బండరాయితో తలపై మోదాడు. దీంతో నర్సయ్య మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేసిన పోలీసులు.. కోర్టులో సాక్ష్యాధారాలు సమర్పించారు.

వేటగాళ్లపై అడవిపందుల దాడి

చందుర్తి: అడవిపందుల దాడిలో వేటగాళ్లకు తీవ్రగాయాలయిన ఘటన చందుర్తి శివారులోని బోడగుట్ట ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. జోగాపూర్ గ్రామానికి చెందిన సంచార జీవనం సాగించేవారితో అడవిపందుల వేటకు వెళ్లారు. అప్పటికే వారికి పంది చిక్కగా, మరో దానికోసం వేటాడుతుండగా దాడిచేసింది. ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్పంగా గాయపడినట్లు సమాచారం.

ముగిసిన అంతర్రాష్ట్ర క్రీడలు

- క్రీడల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ రాజేంద్రనగర్, ఉత్తర తెలంగాణ జట్టు
- విజేతలకు బహుమతులు ప్రదానం


మాట్లాడుతున్న ఝాన్సీరాణి


బహుమతి అందుకుంటున్న రాజేంద్రనగర్ జట్టు

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్రాష్ట్ర క్రీడా, సాంస్కృతిక పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలకు వ్యవసాయ వర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె. ఝాన్సీరాణి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీ నారాయణ్ భట్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి వర్సిటీ క్రీడలకు పొలాస కళాశాల వేదిక కావడం అభినందనీయమన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ పోటీల్లో పాల్గొడడం వల్ల క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. వ్యవసాయ వర్సిటీ క్రీడా పరిశీలకులు డాక్టర్ సురేశ్, వర్సిటీ నాన్ టీచింగ్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, జయరామ్, కళాశాల స్టూడెంట్ ఆఫైర్ కన్వీనర్ డాక్టర్ మహేశ్ రెడ్డి, క్రీడా ఇన్‌చార్జి డాక్టర్ రత్నాకర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, నాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ షిప్ రాజేంద్రనగర్ జట్టు

రాష్ట్రస్థాయి క్రీడల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ రాజేంద్రనగర్ జట్టు కైవసం చేసుకోగా, సాంస్కృతిక విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను ఉత్తర తెలంగాణ జట్టు కైవసం చేసుకుంది. క్రికెట్‌లో దక్షిణ తెలంగాణ, వాలీబాల్‌లో మధ్య తెలంగాణ, బాల్ బ్యాడ్మింటన్‌లో ఉత్తర తెలంగాణ, షటిల్ బ్యాడ్మింటన్‌లో రాజేంద్రనగర్, టేబుల్ టెన్నిస్‌లో రాజేంద్రనగర్, చెస్‌లో మధ్య తెలంగాణ, కార్యమ్‌లో మధ్య తెలంగాణ జట్లు విజయం సాధించాయి. వివిధ జోన్లకు చెందిన క్రీడాకారులు బహుమతులు అందుకున్నారు.

మూడు రోజులు ఉత్సాహంగా



మూడు రోజులు క్రీడాపోటీల్లో ఉత్సాహంగా సాగాయి. వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది.
– అయేషా, అడ్మినిస్ట్రేటివ్ జోన్, హైదరాబాద్

స్నేహభావం పెంపు



క్రీడాపోటీల్లో పాల్గొనడంతో కొత్తవారితో స్నేహభావం పెంపొందుతుంది. మూడు రోజులు నిర్వహించిన క్రీడా పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాం.
– సుకన్య, రాజేంద్రనగర్ జోన్

టీం సహకారంతో..



ఒక్కరిగా కాకుండా టీం సహకారంతో చాలా పతకాలు గెలుచుకున్నాం. క్రీడా, సాంస్కృతిక పోటీలు ఉత్తేజం నింపాయి. క్రీడా పోటీల నిర్వహణ బాగుంది.
– అనురాధ, ఉత్తర తెలంగాణ జోన్

రాజన్న సన్నిధిలో..


ఆలయ ఆవరణలో భక్తులకు అల్పాహారం వడ్డిస్తున్న విప్ ఆది


స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు


శివలింగానికి నమస్కరిస్తున్న భక్తులు


భక్తుల కోసం ఏర్పాటు చేసిన బస్సు


విద్యుత్ కాంతుల్లో మూలవాగు వంతెన

కాలువ పనులు ప్రారంభించకుంటే దీక్ష

- రంగనాయక సాగర్ ప్రాజెక్టు ఎల్ఎం– 6 కెనాల్ రైతుల హెచ్చరిక


రైతులతో మాట్లాడుతున్న డీఈ సీతారాం

ఇల్లంతకుంట: రంగనాయకసాగర్ ప్రాజెక్ట్ అనుబంధ ఎల్ఎం –6(లెఫ్ట్ మైనర్) అసంపూర్తి కాలువ పనులు ప్రారంభించకుంటే మార్చి 3వ తేదీన నిరాహార దీక్ష చేస్తామని ప్రభావిత రైతులు హెచ్చరించారు. ఈమేరకు రంగనాయక సాగర్ ప్రాజెక్టు డీఈ సీతారాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టు డీఈ సీతారాం.. దాచారం శివారు నుంచి చిన్న లింగాపురం శివారు మధ్య ఒక కిలోమీటర్ మేర నిలిచిపోయిన ఎల్ఎం – 6 కాలువ పనుల స్థల పరిశీలన కోసం మంగళవారం వచ్చారు. సమాచారం అందుకున్న పెద్ద లింగాపురం, రామాజీపేట, చెక్కుడువానిపల్లి గ్రామాల రైతులు డీఈ వద్దకు వెళ్లారు. కాలువ పనులు ఎందుకు సాగడం లేదని నిలదీశారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు. దీంతో ఆర్ఐ షఫీయుద్దీన్‌ను వెంటనే కాలువల వద్దకు రావాలని డీఈ ఆదేశించడంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అసంపూర్తి పనులు, భూముల గురించి వివరణ అడిగారు. అయితే, అవి తమ పరిధిలో లేదని ఆర్ఐ వివరించారు. అసంపూర్తి పనులతో ఏడుగురు రైతులకు రూ.1.30 కోట్ల చెల్లింపులు ఆగిపోయాయని పెద్ద లింగాపురం రైతులు అంటున్నారు. కార్యక్రమంలో రైతులు అమ్ముల అశోక్, ఎలవేణి రమేశ్, కరికే నవీన్, కమటం రవి, జి.మల్లేశం, వీఆర్వో సింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్య


రాకేష్ (ఫైల్)

కోనరావుపేట: కళాశాల నుంచి వస్తూ అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో రైలు కిందపడి మృతి చెందినట్లు తల్లిదండ్రులకు సమాచారం అందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పొట్ల బాలమల్లు– మంజుల దంపతుల కుమారుడు రాకేశ్ (18)హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటికి వస్తూ సిరిసిల్ల బస్టాండ్‌లోని ధర్మారం గ్రామానికి వెళ్తున్న ఆటోలో బ్యాగు పెట్టాడు. తర్వాత కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రాకేశ్ హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో సూసైడ్ నోట్ రాసి రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందింది. అమ్మ, నాన్న క్షమించండి. నాకు బతకాలని లేదు. నా చావుకు కారణం ఎవరు కాదు అని సూసైడ్ నోట్‌లో ఉంది. పోలీసులు ఫోన్‌లో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. రాకేశ్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

స్వగ్రామానికి చేరిన యువకుడు


పాస్‌పోర్టుతో శ్రీకాంత్

జగిత్యాలక్రైం: మోసపూరిత విదేశీ నియామక సంస్థ చేతుల్లో మోసపోయిన కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన వలస కార్మికుడు కడకుంట్ల శ్రీకాంత్ పలువురి సహాయంతో మంగళవారం స్వగ్రామం చేరాడు. శ్రీకాంత్‌ను 40 రోజల క్రితం జగిత్యాలకు చెందిన మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ఎలక్ట్రీషియన్ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చి దుబాయ్ పంపించింది. అక్కడికి చేరిన అనంతరం లేబర్ ఉద్యోగంలో చేర్పించారు. ఆ పని చేయలేనని శ్రీకాంత్ అనడంతో పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని 7300 దిరమ్స్ (ఇండియా రూ.2లక్షలు) చెల్లించాలని కంపెనీ యాజమాన్యంతోపాటు, కేరళకు చెందిన ఓ ఏజెంట్ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు టీపీసీసీ ఎన్ఆర్ఐసెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషాను ఆశ్రయించారు. ఆయన దుబాయ్‌లోని ఇండియన్ ఎంబసీకి సమాచారం అందించారు. స్పందించిన ఎంబసీ వారు కంపెనీ యాజమాన్యాన్ని మందలించడంతో శ్రీకాంత్‌ను స్వగ్రామానికి పంపించేందుకు నిరాకరించారు. దీంతో ఇండియన్ ఎంబసీ దుబాయ్ ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. లేబర్ కోర్టు విచారణ జరపగా శ్రీకాంత్ కోర్టులో నెగ్గాడు. దీంతో కంపెనీ యాజమాన్యం ఫిర్యాదును కొట్టివేసి అతని పాస్‌పోర్టును శ్రీకాంత్‌కు అప్పగించడంతో మంగళవారం స్వగ్రామానికి చేరుకున్నాడు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి వై.శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొర్లపల్లి గ్రామ శివారులోని రాచర్ల జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న పరీక్షలకు ఇప్పటి నుంచే సంసిద్ధులు కావాలన్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో రాణించేందుకు మంచి మార్కులు సాధించాలని సూచించారు. గతేడాది కళాశాల నుంచి రాష్ట్ర, జిల్లా ర్యాంకులు సాధించిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, చైర్మన్ ఐత వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఏలూరి రాజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ఉత్తీర్ణత సాధించాలి

కోనరావుపేట: విద్యార్థులు క్రమశిక్షణతో మంచి ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. వార్షిక ఫలితాల్లో ప్రతిభ కనబర్చి కళాశాలకు గుర్తింపు తీసుకరావాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

80 ఏళ్ల వేడుకను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

సిరిసిల్లకల్చరల్: టీఎస్‌జీవోల సంఘం 80 వసంతాల వేడుకను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, 317 జీవో బాధితులు, కారుణ్య నియామకాలు, పీఆర్‌సీ పెండింగ్ డీఏలను కూడా అదే వేగంతో క్లియర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, గాజుల సుదర్శనం, సమర్‌సేన్ జయంత్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కుమార్ స్వామి, జీవన్, ఎం శ్రీకాంత్, రియాజ్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

'మల్కపేట' నీటిని విడుదల చేయండి

- ఉత్తమ్‌కుమార్ రెడ్డికి కేటీఆర్ లేఖ

సిరిసిల్లటౌన్: మల్కపేట రిజర్వాయర్ ద్వారా మిడ్ మానేర్ నీటిని ఎత్తిపోసి సింగసముద్రాన్ని నింపాలని కోరుతూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు లేఖ రాశారు. బీఆర్ఎస్ హయాంలోనే మల్కపేట రిజర్వాయర్ ఎత్తిపోతల ట్రయల్ రన్ కూడా పూర్తయిందని, ఎన్నికల కోడ్ రావడం వల్ల ప్రారంభోత్సవం చేయలేకపోయామని పేర్కొన్నారు. ఇప్పుడు మిడ్ మానేరులో 17 టీఎంసీల నీరు ఉన్నందున నీటిని ఎత్తి పోసి సింగసముద్రం పరిధిలోని 2వేల ఎకరాలకు సాగునీరందించాలని కోరారు. నీటి ద్వారా రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, దేవునిగుట్ట తండా, రాచర్ల తిమ్మాపూర్, బాకూర్‌పల్లి తండా, రాజన్నపేట, కిష్టునాయక్ తండా, అక్కపల్లి, బుగ్గరాజేశ్వర తండా, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, కోరుట్లపేట, సముద్ర లింగాపూర్ రైతుల పంటలను కాపాడుకున్న వారమవుతామని విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన బాలె తేజస్విని (32) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. పోలీసుల వివరాలు.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిరకు చెందిన మీసాల కాంతయ్య కూతురు తేజస్వినిని 2020లో గాంధీనగర్‌కు చెందిన బాలె సాయిరాజ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి కూతురు (3) సంతానం. కొద్దికాలంగా తేజస్విని కడుపునొప్పితో బాధపడుతోంది. జనవరి 31న పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కొద్దిరోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రయత్నించినా లాభంలేకపోయింది. మృతురాలి తండ్రి మీసాల కాంతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

నేనొస్తా... వేములవాడ జాతరకు

- తరలివస్తున్న పల్లె భక్తులు
- రాజన్న సన్నిధిలోనే జాగారం
- నేటికీ నాటి సంప్రదాయమే..


నెత్తిన ముల్లెలతో తరలివస్తున్న భక్తులు

వేములవాడరూరల్: ఏమి లేని వేములవాడలో రాజన్న ఏమి చూసి నిలిచితివయ్యా రాజన్న అంటూ.. పల్లె భక్తులు నెత్తిన ముల్లె, సంకన పిల్లతో గ్రామీణ ప్రాంతాల నుంచి రాజన్న జాతరకు తరలివస్తున్నారు. పేదల పెన్నిధిగా నిరుపేదలకు అండగా పేరున్న బోళాశంకరుని సన్నిధానంలో శివరాత్రి రోజు జాగారం జరుపుకోవడం పల్లె, పట్టణ భక్తులకు ఆనవాయితీ. ఏటా ఎన్ని కష్టాలైనా భరించి రోడ్లపైన స్థలాల మీదనే జాగారం జరుపుకుని మూడు రోజులు ఉండి తిరుగు ప్రయాణమవుతారు.

నిరుపేదలకు ఆరు బయటనే విడిది

రాజన్న సన్నిధికి వచ్చే భక్తులలో అత్యధిక శాతం శివరాత్రి రోజు గ్రామీణ ప్రాంత భక్తులు తరలివస్తారు. వీరికి ఎక్కడా ఆలయ వసతిగదులు దొరకవు. ఎక్కడ స్థలం దొరికితే అక్కడే విడిది చేసి జాగారాలు చేసుకుంటారు. ఉదయాన్నే స్వామివారికి నైవేద్యం వండుకుని భోజనం చేసి తిరుగు ప్రయాణం అవుతారు.

నేటికీ నాటి సాంప్రదాయమే..

కోరుట్ల, నిజామాబాద్, ఆర్మూర్, ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రూరల్ మండలంలోని పోచెట్టిపల్లి వద్ద ఉన్న ధర్మగుండంలో స్నానాలు చేసి రాజన్న సన్నిధానానికి వస్తారు. కొన్నేళ్లుగా ఆ ప్రాంతం నుంచి ఎడ్ల బండ్లపై వచ్చే భక్తులు అక్కడ స్నానాల అనంతరం రాజన్న దర్శనం చేసుకోవడం ఆనవాయితీ. ఇప్పటికీ కొంత మంది భక్తులు అదే సాంప్రదాయాన్ని పాటిస్తున్నారు.

ఓటమి భయంతోనే బీఆర్ఎస్ ఎన్నికలకు దూరం


మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని నిలుపలేదని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారని అంటున్న కేటీఆర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, సీనియర్ నాయకులు గడ్డం నరసయ్య, వెలుముల స్వరూప, గోనె ఎల్లప్ప, కోడం అమర్నాథ్, గుండ్లపల్లి గౌతం, నేరెళ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవోగా జనార్దన్ రావు


జనార్దన్ రావు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లా విద్యాధికారిగా జనార్దన్ రావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల డీఈవోగా జిల్లాకు వచ్చిన డైట్ లెక్చరర్ జగన్మోహన్‌రెడ్డి సెలవుపై వెళ్లడంతో జిల్లా విద్యాధికారి మార్పు జరిగినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రంజాన్ పండుగ ఏర్పాట్లు చేయాలి

సిరిసిల్లకల్చరల్: ముస్లింలకు పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో పండుగ ఏర్పాట్లు చేయాలని జిల్లా మైనార్టీ అభివృద్ధి అధికారి ఎంఏ భారతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. మసీద్‌లు, ఈద్గాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్, నీటి సౌకర్యానికి అంతరాయం లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సహర్, ఇఫ్తార్ సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దన్నారు. సమావేశంలో ఆర్డీవో రాధాబాయి, డీపీవో శేషాద్రి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వేములవాడ కమిషనర్ అన్వేష్, పౌరసరఫరాల అధికారి పి.వసంతలక్ష్మి, డీఎస్పీ మురళీకృష్ణ, సెస్ అధికారి డి.అరవింద్‌చారి, తహసీల్దార్ ఉమారాణి, ముస్లిం మత పెద్దలు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉదయ సాహితీ రాష్ట్ర కార్యవర్గం


సేనాధిపతి

జ్యోతినగర్(రామగుండం): ఉదయ సాహితీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు శ్రీదాస్యం లక్ష్మయ్య ప్రకటించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడిగా దాస్యం సేనాధిపతి(కరీంనగర్), అధ్యక్షుడిగా శ్రీదాస్యం లక్ష్మయ్య(పెద్దపల్లి), ఉపాధ్యక్షులుగా ఎస్వీ రఘువీర్ ప్రతాప్(నల్గొండ), పోరెడ్డి రంగయ్య(ఆలేరు), పల్లేరు వీరాస్వామి(వరంగల్), ఎర్రం రాజారెడ్డి(కరీంనగర్), శ్రీపెరంబుదూరి లింబగిరి స్వామి(మెట్‌పల్లి), మహిళా ఉపాధ్యక్షులుగా చీదేళ్ల సీతాలక్ష్మీ(హైదరాబాద్), రమాదేవి కులకర్ణి(హైదరాబాద్), మద్దెల సరోజన(జగిత్యాల), చిందం సునీత(కరీంనగర్), కటుకం కవిత(కోరుట్ల), ప్రధాన కార్యదర్శిగా వురిమళ్ల సునంద, సహాయ కార్యదర్శులుగా ఏడెల్లి రాములు(పెద్దపల్లి), గుడ్ల దొన సాయిచంద్రశేఖర్(హైదరాబాద్), మేరుగు అనురాధ(వరంగల్), రాజన్న(కరీంనగర్), కోశాధికారిగా వెంకట రమణాచార్యులు(హైదరాబాద్)ను నియమించారు.